
# రోజులొకేలాగ వుండవు




## కందుకూరి వెంకట మహాలక్ష్మి

"అయ్యయ్యో ఈ కుక్కర్ అలా పడేశావేమిటే? ఎందుకేనా పనికొస్తుందా? దీని ఖరీదెంతో తెల్సా? నీ బాబు కొంటాడా? అయినా నీ బాబెవడో నీకు తెలిస్తే కదా!" అంటూ దండకం మొదలెట్టింది ప్రణీత. కంగారుపడిపోయిన రవళి ఏం చెయ్యాలో తోచక ఏడుపు లంకించుకుంది.

"చాల్లే ఇదో విద్య నీదగ్గరుంది. చేసేవి వెధవ పన్లూ ఏమన్నా అంటే శోకాలూ.. నోరుముయ్" అంటూ చేయెత్తిన ప్రణీతని వెనక నుంచి ఆపిన రజనీష్ "బరువుగా వుండి చెయి జారిందేమో" అంటూ ఏడుస్తున్న రవళిని దగ్గరకు తీసుకున్నాడు.

ఇలాగే దీన్ని పాడు చెయ్యండి. రేపు నెత్తెక్కుతుంది. అప్పుడు తెలుస్తుంది" అంటున్న ప్రణీత వైపు కాస్త కోపంగానే చూశాడు రజనీష్.

రాత్రి రవళి నిద్రపోతోంది. నిద్రపట్టని రజనీష్ ప్రణీత రాకకు ఎదురు చూస్తున్నాడు. ప్రణీత చంటదాన్ని మంచం మీద పడుకోబెట్టి, తనూ పడుకోడానికి మంచం దగ్గరకు వచ్చింది.

'చంటిది పడుకుందా?" అన్నదానికి 'ఆ' అంటూ వచ్చి పడుకోబోయింది. "చూడు ప్రణీతా నీతో కొన్ని విషయాలు మాట్లాడాలనుకుంటున్నాను. కాస్త వింటావా?" అన్న రజనీష్ మాటలకు "ఏమిటీ?" అన్నట్లు చూసింది.

"చూడు ప్రణీ! నేను నీలో చాలా మార్పుని చూస్తున్నాను. మనకు బిడ్డ పుట్టిన దగ్గర నుంచీ రవళిని చాలా చులకనగా చూస్తున్నావు. రవళిని పెంచుకుందామని గొడవ చేస్తుంటే తొందరపడకు, కొన్నాళ్ళాగు అంటే విన్నావు కాదు. సొంత బిడ్డ మీద వున్న ప్రేమతో రవళిని వంటమనిషిగా మార్చావు. ఇది మంచిది కాదు" అంటూ చెప్తున్న భర్త దగ్గర నుంచి చర్రున లేచి వచ్చి కూతురు లావణ్య ప్రక్కన పడుకుంది. ఇంక ప్రణీతకి ఏం చెప్పీ ప్రయోజనం లేదని తెలిసిన రజనీష్ మాట్లాడకుండా ప్రక్కకి తిరిగి పడుకున్నాడు. పడుకున్నాడే గానీ నిద్ర రావటం లేదు. ఆలోచనలు గతాన్ని తవ్వసాగాయి.

❋ ❋ ❋

"ఏమండీ! ఇవాళ వెళ్దామండీ! ఎప్పటి నుంచి మిమ్మల్ని అడుగుతున్నానండీ. ఓ ముద్దూ ముచ్చటా మనకీ కావాలనిపిస్తుంది కదా!" అంటూ రజనీష్ మెడ చుట్టూ చేతులేసి గోముగా బ్రతిమాలుతున్న ప్రణీతని చూస్తూ, "ప్రణీతా! నీకేమన్నా పిచ్చి పట్టిందా? మన పెళ్ళయి అయిదేళ్ళు నిండలేదు. మనిద్దరం డాక్టర్ దగ్గరకెళ్ళి పరిక్షలు చేయించుకున్నాం. ఇద్దరిలో లోపం లేదన్నారు. కొందరికి

ఆలస్యంగా పిల్లలు పుడతారు. నువ్వంత తొందర పడితే ఎలా? ఇంకొక్క రెండేళ్ళు చూసి అప్పటికీ పుట్టకపోతే అప్పుడు ఆలోచిద్దాం కంగారు పడకు ప్రణీ" అంటూ తనూ ముద్దుగానే ఆమెకు సమాధానం చెప్పాడు రజనీష్.

దాంతో అలిగి దూరంగా వెళ్ళి సోఫాలో కూర్చుంది ప్రణీత. ఆమె అలక చూసి సోఫాలో ప్రక్కన కూర్చుని ఆమె భుజం మీద చెయ్యి వేసి "సరే ఒక్క ఏడాది ఆగు తరువాత పెంచుకుందాం" అంటూ ఆమె అలక తీర్చాడు.

"చూడండీ! ఎవరింటికెళ్ళినా వాళ్ళు చిన్న పిల్లలతో ఆడుకోవడమో, పాలు పట్టడమో, వాళ్ళని స్కూలు నుంచి తీసుకు రావడమో చేస్తూ వుంటారు. ప్రతీ యింట్లో ఏదో పేరంటమనో, భోగి పళ్ళు పోస్తున్నామనో, బొమ్మల కొలువనో, పుట్టిన రోజనో, అక్షరాభ్యాసం అనో, అన్నప్రాశన అనో పిలుస్తారు. నాకు వాళ్ళని చూస్తుంటే ఎంత బాధగా వుంటుందో మీకేం తెలుసు" అంటూ కళ్ళనీళ్ళెట్టుకునే ప్రణీతకి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీటం లేదు.

ఇది ఆ రోజు జరిగిన విషయం కాదు. ఇలా ప్రణీత ఓ ఆరు నెల్లుగా రజనీష్ బుర్ర తినేస్తూనే వుంది. ఏదన్నా అనాథ శరణాలయానికి వెళ్ళి ఓ బిడ్డని తెచ్చి పెంచుకుందామని ప్రతిరోజూ ఏదో టైములో రజనీష్‌తో అంటూనే వుంది.

అలా రజనీష్ పెట్టిన ఏడాది గడువు కూడా దాటిపోయింది. ఈ మధ్యలో ప్రణీత పిల్లలకోసం చిన్న ఆపరేషన్ కూడా చేయించుకుంది. అయినా లాభం లేకపోవడంతో ఆమె పట్టుదల మరీ ఎక్కువయింది. ఇంక భార్య మొండి పట్టు వదలదని తెలిసిన రజనీష్ ఓ రోజు భార్యతో ఓ అనాథ శరణాలయానికి బయలుదేరాడు. కాస్త చీకటి పడుతోంది. గేటు దగ్గరకు వెళ్తుండగానే ఓ స్త్రీ ముసుగు వేసుకుని ఒళ్ళో ఓ చంటిబిడ్డని పెట్టుకుని లోపలికి వెళ్తూ కనపడింది. ప్రణీతకి ఆ స్త్రీని చూడగానే ఏదో అనుమానం కలిగి "ఏమమ్మా! నీ ఒళ్ళో వున్న బిడ్డని ఆనాథ శరణాలయంలో దించడానికి వెళ్తున్నావా?" అని అడగ్గానే "అవునమ్మా. మోసపోయిన ఓ కన్యను, గతిలేక ఈ బిడ్డని కని, అనాథ శరణాలయానికి అప్పగించడానికి వెళ్తున్నాను" అంది. మనిషిని చూస్తే మంచి యింటి పిల్లలాగే వుంది. దానితో ఓ ఆలోచన వచ్చిన ప్రణీత "ఏమండీ అనాథ శరణాలయంలో అయితే బోల్డు ఫార్మాలిటీస్ వుంటాయి. ఈ బిడ్డనే పెంచుకుంటే మంచిద్దేమో కదా!" అంది భర్తతో. ఇదీ బాగానే వుందని ఆమెను పక్కకు పిలిచి, మాకు పిల్లలు లేరు. ఓ బిడ్డని పెంచుకోవాలని ఈ శరణాలయానికి వచ్చాం. నీకభ్యంతరం లేకపోతే నీ బిడ్డని మాకు యివ్వు, మేం పెంచుకుంటాం" అనగానే "అంతకంటే నాకు కావలసిందేముంది?" అంటూ ఆ బిడ్డని వారికివ్వ బోయింది. "అలాకాదు నువ్వు మాతో రా, ఆ పక్కనే ఉన్న హోటల్‌లోకి వెళ్దాం" అంటూ ఆమెను వెంటబెట్టుకుని అక్కడే వున్న ఒక హోటల్‌కు వెళ్ళారు. ఆమె బిడ్డను తీసుకొని ఆమెకి కొంత డబ్బిచ్చి పంపించారు. ఆమె ఆనందం, దుఃఖం మిళితమైన అశ్రునయనాలతో బిడ్డని విడిచి వెళ్ళింది.

ఇంక ప్రణీత హడావిడి చెప్పనక్కరలేదు. ఆ పాపకి రవళి అని పేరు పెట్టారు. చంటిపిల్లకి యివి కావాలనీ, అవి కావాలనీ, బట్టలూ, బొమ్మలూ, ఉయ్యాలమంచం ఇలా ఇల్లంతా నింపేస్తోంది. భార్య ఆనందం చూసి రజనీష్ మనసు కుదుటపడింది. పాప కూడా చక్కగా బొద్దుగా వుండటంతో తెగ మురిసిపోయేవారు. వారికి రవళియే జీవితమైపోయింది.

రవళికి నాలుగో ఏడు రాగానే స్కూల్లో వేశారు. రవళి స్కూలుకెళ్ళి రావడం ఆ దంపతులకు చాలా ఆనందంగా వుంది.

కాలం గడుస్తోంది. ఓ రోజు ఆఫీసు నుంచి వచ్చిన రజనీష్‌కి ప్రణీత ఒంట్లో బాగుండటం లేదని అనడంతో డాక్టర్ దగ్గరకు వెళ్ళారిద్దరూ. డాక్టర్ ప్రణీతని పరీక్ష చేసి గర్భిణీ అని చెప్పడంతో ఆ దంపతులిద్దరూ ఎంతో ఆనందించారు.


ప్రణీతకు నెలలు నిండాయి. ఆడపిల్ల కలిగింది. ఆ పిల్ల పుట్టి పెరుగుతున్న దగ్గర నుంచీ ప్రణీతలో మెల్లిమెల్లిగా కాస్త కాస్త మార్పు రావడం రజనీష్ కనిపెట్టాడు. అది అలా ఆమెలో పెరుగుతూ వచ్చిందే తప్ప తగ్గలేదు.

సొంత కూతురు మీద శ్రద్ధ పెరగడంతో పాటు, రవళి పట్ల అశ్రద్ధ ఎక్కువ కాసాగింది. రవళి అలా రవ్వీ అయింది. నెమ్మదిగా రవళిచేత ఇంట్లో పన్లు చేయించడం, చంటిపిల్ల పన్లు చేయించడం ప్రారంభించింది. అలా కూరలు తరగడం, వంట చేయించడం దాకా పాకింది. అదలా పనిమనిషి రాని రోజుని అంట్లు తోమించడం, బట్టలు ఉతికించడం ప్రారంభించింది. మరో రెండేళ్ళకి రవళిని పూర్తిగా పని మనిషీ, వంటమనిషిగా మార్చేసింది. రజనీష్ ఎంత మొత్తుకున్నా ప్రణీత పట్టించుకునేది కాదు.

"ఇందుకే కొన్నాళ్ళాగు మనకి పిల్లలు పుడతారంటే విన్నావు కాదు. అనాథ పిల్లను తీసుకొచ్చి బాధలు పెడుతున్నావు. ఇది మంచిది కాదు ప్రణీతా!" అంటే "ఆడపిల్లకు పనులు నేర్పకపోతే ఎలాగా?" అంటూ భర్త మీద ఎగిరేది.


చదువుకునే టైముండక ఇంట్లో చాకిరితో సతమతమయ్యే రవళి పరీక్ష పాసుకాకపోవడంతో "నీకింక చదువు అబ్బదు" అంటూ స్కూలు మానిపించేసింది ప్రణీత. రవళికి తిండిపెట్టడమే దండగనిపించేది ప్రణీతకు. రోజూ ఏదో వంక పెట్టి సాధించి, సతాయించేది. అమ్మా, అబ్బా ఎవరో తెలీని రవళి నోరెత్తలేక, ఆమె తన్నెందుకలా

*(మిగతా 30వ పేజీలో చూడండి)*



## 'బ్యాడ్ బాయ్' బాతాఖానీ!

**బా**లీవుడ్ బ్యాడ్ బాయ్ సల్మాన్‌ఖాన్ మరోసారి వార్తలకెక్కాడు. సల్మాన్, ఐశ్వర్యల ప్రేమవ్యవహారం తెలిసిందే. ప్రేమాయణం జరుగుతున్న సమయంలో తన 'బడా భాయ్'కి ప్రోగ్రామివ్వమని, లేకుంటే చంపిస్తానని బెదిరిస్తూ మాట్లాడినట్లున్న టేపులు బయటపడ్డాయి. దాంతో హీరో సల్మాన్ మరోసారి ప్రేక్షకుల ముందు విలనైపోయాడు. కొన్ని పార్టీల వారు సహజంగానే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. అయితే ఈ బ్యాడ్ బాయ్ నటించిన 'మైనే ప్యార్ క్యోం కియా' చిత్రానికి ప్రేక్షకాదరణ తగ్గకపోవడం విశేషం!



## రోజులొకేలాగ వుండవు కథ

(27వ పేజీ తరువాయి)

తిడుతోందో తెలీక ప్రణీత అనే మాటల్ని సహించ డం తప్ప ఏమీ చెయ్యలేకపోయింది.

ఎంతకాలం రవళి బాధల్ని అనుభవించాలి అనుకుంటూ బాధతో నిద్రలోకి జారుకున్నాడు రజనీష్.

గేటు తీసుకుని లోపలికొస్తున్న ఓ యువతిని "ఎవరా?" అన్నట్లు చూసింది. ఆమె నమస్కారం పెట్టి "లోపలికి రావచ్చా అమ్మా!" అనగానే "రండి ఎవరు మీరు? అంది లోపలికొచ్చి కూర్చుంటూ మీరు నన్ను మర్చిపోయినా, నేను మీ మేలు మరువలేనమ్మా" అంది రెండు చేతులూ జోడిస్తూ. "మీరెవరో ఏం మేలు చేశానో తెలీటం లేదు. గుర్తు రావటం లేదు చెప్పండి?" అంది కనుబొమ్మలు ముడివేసి.

"అమ్మా! మీ ఇంట్లో వున్న ఆ అమ్మాయి నా కూతురు. దాన్ని ఆ రోజు మీకు ఆ హోటల్లో పెంపకానికి యిచ్చాను." అన్న మాటలు పూర్తి కాకుండానే "అయితే ఏమిటిట? ఇప్పుడింకా డబ్బు కావాలా? అయినా మా యిల్లెలా తెలిసింది?" అన్నదానికి "ఆ రోజు మీరు వెళ్ళిపోయాక మీకు కొంత దూరంలో ఫాలో అయి మీ యిల్లు చూశాను. కన్న ప్రేమని చంపుకోలేక నా బిడ్డని అప్పుడప్పుడూ దూరం నుంచి చూసి ఆనందపడు తున్నానమ్మా. ఇప్పుడో చిన్న విన్నపం. నేనిప్పుడు టీచర్‌గా ఉద్యోగం చేసుకుంటున్నాను. ఇప్పుడు నన్ను అనేవాళ్ళు కూడా ఎవ్వరూ లేరు. నాకు ఏ డబ్బూ వద్దు. మీకు ఇప్పుడో బిడ్డ వుంది. నా బిడ్డని నాకు తిరిగి యిచ్చేస్తే నేను పెంచుకుంటానని అడగటానికి వచ్చానమ్మా. దయచేసి కాదనక, నా బిడ్డని నాకు అప్పగించండమ్మా" అంటూ ప్రాధేయ పడుతున్న ఆ స్త్రీని చూసిన ప్రణీత మనసు ఉప్పొంగిపోయింది. ఈ పిల్లకి పెళ్ళి గిట్రా చెయ్యా లంటే బోల్డు ఖర్చు. చదువూ సంధ్యా లేనిదాన్ని ఈ రోజుల్లో ఎవరు చేసుకుంటారన్న ఆలోచనని బైట పడనివ్వకుండా కాస్సేపు ఇటూ అటూ లాగి "సరే తల్లివి, కన్న బిడ్డని కావాలంటే కాదనగలనా?" అంటూ ప్రణీత రవళినీ, బట్టల్నీ ఆ స్త్రీకి అప్ప గించింది.

ఎంతో ఆనందంతో వెయ్యి నమస్కారాలు చేసి, రవళిని వెంటబెట్టుకుని వెళ్ళిందా స్త్రీ. ఈ ఇంట్లో ప్రణీత పెట్టే బాధల్ని భరించలేని రవళి, వచ్చిన స్త్రీ తన తల్లి అని తెలిసి వెంట వెళ్ళిపోయింది.

రజనీష్ ఈ విషయం విని తల్లడిల్లిపోయాడు. ప్రణీత మీద చాలా కోపం వచ్చింది. "కూతురిలా పెంచాం. కనీసం మాటమాత్రానికైనా చెప్పకుండా, అడక్కుండా, ఇన్నేళ్ళూ పెంచిన ప్రేమని మర్చి పోయి ఆమె తీసుకున్న నిర్ణయానికి బాధపడటం తప్ప ఏం చెయ్యాలి" అంటూ బాధపడ్డాడు.

కాలం గడిచిపోతోంది. లావణ్య పెరిగి పెద్ద దవుతోంది. స్కూలుకెళ్ళి వస్తోంది.

"అమ్మా! మా స్కూలు పిల్లల్ని స్టడీ టూర్‌కి సవుల్ వైపుకి తీసుకెళ్తున్నారు నేనూ వెళ్తానమ్మా" అని అడుగుతున్న కూతుర్ని కాదనలేక 'సరే' అంటూ టీచర్‌కి పదిసార్లు జాగ్రత్తలు చెప్పి, స్టేషన్ కెళ్ళి లావణ్యకి టాటా చెప్పి వచ్చారు తల్లిదండ్రులు.

ఆ రోజు టీవీలో వార్తలు వింటున్న రజనీష్, ప్రణీతలు చాలా కంగారుపడ్డారు. తరువాత వాళ్ళ కంగారు నిజమే అయింది. లావణ్య స్కూలు పిల్లలు, స్కూలు టీచర్లు కలిసి సముద్రపొడ్డుకి వెళ్ళారు. వెళ్ళి ఆనందిస్తున్నవారిని అకస్మాత్తుగా సునామి మింగేసింది. దాంతో ఎక్స్‌కర్షన్ తరువాత తిరిగి రావలసిన పిల్లలూ, టీచర్లూ తిరిగి రాలేదు. వారిలో లావణ్య ఒకర్తె కావడం షాకయి కుప్పలా కూలిపోయారు ప్రణీత, రజనీష్‌లు.

నెమ్మనెమ్మదిగా కోలుకోడానికి ప్రయత్నిస్తు న్నాడు రజనీష్, కానీ రోజు రోజుకీ దిగజారి పోతున్న ప్రణీత ఆరోగ్యం దెబ్బతినసాగింది. అది చూసి ఏం చెయ్యాలో తోచక కుమిలిపోసాగాడు రజనీష్.

పార్కులో బెంచీ మీద కూర్చున్న రజనీష్‌ని 'నాన్నా' అంటూ పిల్చిన పిలుపుకి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. ప్రక్కగా రవళి. కాలేజీ నుంచి ఇంటికి వెళ్తున్న రవళిని చూసి గట్టిగా హృద యానికి హత్తుకున్నాడు. కళ్ళంట గిర్రున తిరిగిన నీటిని తుడుచుకున్నారిద్దరూ. రవళి భుజం తట్టి పక్కన కూర్చోబెట్టుకుని, రవళికి జరిగిన విష యాలన్నీ చెప్పి, ప్రణీత పరిస్థితి గురించి చెప్పి బాధపడసాగాడు రజనీష్.

"అయ్యో నాన్నా! నాకీ విషయాలేవీ తెలీవు. అమ్మకి నేను రావడం యిష్టముండదని రాలేదు. నాన్నా! పదండి ఇంటికెళ్ళి అమ్మని చూసి వద్దాం" అంటూ రజనీష్‌తో బయలుదేరింది వయసొచ్చిన రవళి చక్కగా నిండుగా వుంది.

ప్రణీత రవళిని చూడగానే కౌగలించుకుని, దుఃఖాన్ని అపుకోలేక, "పెంచుకున్న నిన్నూ దూరం చేసుకున్నాను, కన్న కూతుర్ని దేముడూ దూరం చేశాడమ్మా!" అంటూ ఊరడించినకొద్దీ ప్రణీత దుః ఖం అధికం కాసాగింది. ఏడ్చి, ఏడ్చి కాస్సేపటికి రవళిని తన ప్రవర్తనకు క్షమార్పణ అడిగి, మళ్ళీ యింటికొచ్చేసి లావణ్య లేని లోటు తీర్చమని బ్రతిమాలసాగింది. "అమ్మకి చెప్పాలి, ఒప్పుకోవాలి కదా!" అన్న రవళి మాటలకు "నేను వచ్చి మీ అమ్మతో మాట్లాడి, బ్రతిమాలుతాను రవళీ" అంటూ అడ్రస్ తీసుకుంది.

రవళి ఇంటికెళ్ళి తలుపు తట్టిన ప్రణీతకి రవళి తల్లి వచ్చి తలుపు తీసి ప్రణీతని గుర్తుపట్టి ఆదరంగా లోపలకు తీసుకెళ్ళడంతో ప్రణీత మనసు కాస్త కుదుటపడింది. 'రవళిని తను పెట్టిన బాధలకు ఎన్ని మాటలు పడాలో' అని భయ పడుతూ లోపలికెళ్ళిన ప్రణీతకు ఆ ఆప్యాయతా, అభిమానం చూసి మనసు ఉప్పొంగిపోయింది. కాస్సేపు కబుర్లయ్యాక ఆమెతో 'అమ్మా! రవళిని మళ్ళీ నాకివ్వమని అడగడానికి వచ్చాననడం ఎంత అసమంజసమో నాకు తెలుసు, కానీ నాకు భగవంతుడు పెద్ద దెబ్బ కొట్టాడు. అది రవళికి చేసిన దాని ఫలితమే. అని పశ్చాత్తాపపడు తున్నాను. రవళికి మీరు కన్న తల్లయితే, నేను కొన్నేళ్ళు పెంచిన తల్లిని. రవళి మనిద్దరి బిడ్డా. కాబట్టి మిమ్మల్ని వేడుకునేదొక్కటే. రవళిని నాకిమ్మని అడిగేకంటే, మీ ఇద్దరూ వచ్చేసి మా యింట్లో వుండండి. మీకూ, నాకూ కూడా పిల్లల్లేని లోటు తీరుతుంది. కాదనకండి" అంటూ చేతులు పట్టుకుని బ్రతిమాలుకున్న ప్రణీతని రవళి తల్లి "తప్పకుండా అలాగే చేద్దాం" అన్న మాటలు ప్రణీతని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేశాయి.

మానవత్వమున్న వ్యక్తి ఉన్నత వాక్యాలు యిలాగే వుంటాయి. నీలా నాలుగు నాల్కలతో, చెడుగా ప్రవర్తించరు. అని మనసు చెప్తున్న నిజాన్ని తెలుసుకున్న ప్రణీత రవళి తల్లి ఔన్నత్యానికి వేయి వేల జోహార్లు అందిస్తూ, ఆనందంతో వెను తిరిగింది. ❋

